
సాక్షి గుంటూరు

బుధవారం । 1 । మే । 2024



పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం

ఫిరంగిపురం: ఫిరంగిపురం తూర్పుబజారులోని పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. ఉదయాన్నే పంచామృతాలతో అభిషేకాలు చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 505.10 అడుగుల వద్ద ఉంది. ఎస్‌ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

ఘనంగా హరిద్ర శృంగారార్చన



పిట్టలవానిపాలెం: చందోలులోని శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో మంగళవారం హరిద్ర శృంగారార్చన వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మ వారిని మహా గౌరీదేవిగా అలంకరించారు.

న్యూస్‌రీల్

ఎన్నికల ఖర్చును రిజిస్టర్‌లో నమోదు చేయాలి

మంగళగిరి: మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న అభ్యర్థులు ప్రతి ఒక్కరూ వారి ఎన్నికల ఖర్చును సంబంధిత రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి మంగళవారం తెలిపారు. అభ్యర్థులు నమోదు చేసిన ఖర్చుల రిజిస్టర్ బిల్లులను మే 1, 5, 10వ తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల లోపు అభ్యర్థి గానీ, వారి తరపున ఎలక్షన్ ఏజెంట్ గానీ ఎన్నికల వ్యయ పరిశీలకులచే తనిఖీ చేయించుకోవాలని సూచించారు.

రూ.4.30 లక్షల నగదు స్వాధీనం

తాడికొండ: తాడికొండ మండలంలో అక్రమంగా తరలిస్తున్న రూ.4.30 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తాడికొండ సీఐ సీహెచ్ ప్రభాకర్ తెలిపారు. వివరాల ప్రకారం ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తనిఖీలలో లాం గ్రామం వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా తుళ్లూరు గ్రామానికి చెందిన నేలపాటి వినీత్ కుమార్ గుంటూరు నుంచి రూ.1.95 లక్షల నగదుతో వెళుతుండగా పట్టుకున్నారు. బండి కుమార్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై రూ. 2.35 లక్షల నగదుతో అచ్చంపేట నుంచి మంగళగిరి వెళుతుండగా పట్టుకొని విచారణ చేయగా తగిన రసీదులు, ఆధారాలు చూపించనందున ఐటీ అధికారులకు అప్పగించినట్లు తాడికొండ సీఐ ప్రభాకర్ తెలిపారు.

రేపు మెగా జాబ్ మేళా



గుంటూరుఎడ్యుకేషన్: సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య-కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాలలో గురువారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల కార్యదర్శి కర్పూరపు రామకృష్ణ ప్రభు తెలిపారు. మంగళవారం కళాశాలలో జరిగిన సమావేశంలో రామకృష్ణ ప్రభు మాట్లాడుతూ టెక్ మహీంద్రా, ఐసీఐసీఐ బ్యాంకు, ఇన్నోవ్ సోర్స్ పాల్గొంటున్న జాబ్‌మేళాకు 2022, 2023, 2024 బ్యాచ్‌లకు చెందిన డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు హాజరు కావాలని సూచించారు. ఏ కళాశాలకు చెందిన విద్యార్థులైనా ఉదయం 10 నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు జరిగే జాబ్‌మేళాకు తమ సర్టిఫికెట్లు, ఇతర ధ్రువపత్రాలతో నేరుగా రావాలని తెలిపారు. నిరుద్యోగ యువత జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో కళాశాల కమిటీ సభ్యుడు సూర్యనారాయణ, ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేటి నుంచి సమ్మర్ క్రికెట్ క్యాంప్

గుంటూరు వెస్ట్ (క్రీడలు): జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నుంచి ఈ నెల 30 వరకు సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంపు కొనసాగుతుందని జిల్లా కార్యదర్శి దాసరి రమేష్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంపును స్థానిక అరండల్‌పేటలోని మాజేటి గురవ్య హైస్కూల్లో ఏర్పాటు చేశామన్నారు. 7 నుంచి 12 సంవత్సరాల బాలబాలికలు ఈ క్రికెట్ క్యాంపునకు హాజరుకావొచ్చని తెలిపారు. వైట్ డ్రెస్‌తోపాటు, సొంత కిట్ బ్యాగ్ ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 94408 53143 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌ల పరిశీలన



నరసరావుపేటరూరల్: మండలంలోని కాకాని గ్రామ సమీపంలో గల జేఎన్‌టీయూలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూములను జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ మంగళవారం పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల్లో ఓటర్లు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అనువైన వాతావరణాన్ని కల్పిస్తున్నామన్నారు. అత్యంత సమస్యాత్మక, సమస్యాత్మకం, సాధారణం అనే మూడు విధాలుగా గ్రామాలను విభజించి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. డీఎస్పీ వీఎస్‌ఎన్ వర్మ, రూరల్ సీఐ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

యార్డులో 95,529 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 95,529 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 88,660 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 18,000 వరకు పలికింది.

ప్రచార పర్వం



ఫిరంగిపురం మండలం యర్రగుండ్లపాడు, బేతపూడి గ్రామాల్లో తాడికొండ ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరిత పర్యటించి, ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జగనన్నను మళ్లీ సీఎంను చేయాలని ప్రజలను కోరారు. - ఫిరంగిపురం



కొల్లిపర మండలంలోని దావులూరిపాలెం, తూములూరు, చివలూరు, శిరిపురం గ్రామాల్లో వైఎస్సార్ సీపీ తెనాలి అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో రోడ్ షోలో పాల్గొన్న శివకుమార్‌కు జనం బ్రహ్మరథం పట్టారు. - కొల్లిపర



వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ వడ్డిముక్కల, జడవల్లి, కట్టెంపూడి, తాళ్లపాలెం, కొండముది, ఆలూరు గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ మేనిఫెస్టో ప్రకటన తర్వాత సీఎం జగన్‌పై ప్రజలకు నమ్మకం మరింత పెరిగిందన్నారు. - పొన్నూరు

నేతన్నకు సమున్నత గౌరవం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేనేత పరిశ్రమకు పూర్వవైభవం

- మగ్గం పెడ్ల నిర్మాణం.. చేనేత భవనం నిర్మాణాలతో పరిశ్రమలో పరుగులు పెడుతున్న అభివృద్ధి
- మంగళగిరి ముఖద్వారంలో నేతన్న విగ్రహం చారిత్రాత్మకం
- ఒక జిల్లా.. ఒక ఉత్పత్తిలో జాతీయ అవార్డు పొందిన మంగళగిరి చేనేత చీరలు
- అవార్డు సాధనలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి అభినందనీయమంటున్న నేతన్నలు



పాతబస్టాండ్ ఆవరణలో నిర్మించిన చేనేత భవనం



నేతన్న సర్కిల్ (ఎన్‌ఆర్‌ఐ జంక్షన్)లో ఏర్పాటు చేసిన నేతన్న విగ్రహం

ఇది కదా.. అభివృద్ధి

మంగళగిరి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో మంగళగిరి చేనేత పరిశ్రమ రూపురేఖలు మరాయని నేతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చేనేత రంగంలో జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన మంగళగిరి చేనేత చీరలకు చారిత్రాత్మక గుర్తింపు లభించింది. వన్ డిస్ట్రిక్ వన్ ప్రాడక్టులో భాగంగా జిల్లా నుంచి చేనేత చీరలు గుర్తింపు పొందడంతో పరిశ్రమ రూపురేఖలు మారాయని నేతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం దేశంలోని ప్రతి జిల్లా నుంచి ఒక ఉత్పత్తిని గుర్తించి ప్రోత్సహించాలనే లక్ష్యంతో చేపట్టిన ఒక జిల్లా.. ఒక ఉత్పత్తి(ఓడీఓపీ) జాతీయ అవార్డుల ప్రక్రియ చేపట్టారు. ఓడీఓపీలో భాగంగా జాతీయ అవార్డు- 2023కు అన్ని రాష్ట్రాల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అందులో భాగంగా రాష్ట్రం నుంచి 13 ఉత్పత్తులకు చోటు లభించగా గుంటూరు జిల్లా నుంచి మంగళగిరి చేనేత చీరలకు అవకాశం లభించింది.



అవార్డు సాధించిన మంగళగిరి చేనేత చీరలు

నగర ముఖద్వారంలో నేతన్న విగ్రహం

అంతేకాక చేనేత పరిశ్రమ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా నేతన్న విగ్రహాన్ని మంగళగిరి-తాడేపల్లి నగర పాలక సంస్థ ముఖద్వారం(ఎన్‌ఆర్‌ఐ)జంక్షన్‌లో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నేతన్నలంతా ఎప్పటికీ అండగా నిలుస్తామని స్పష్టం చేస్తున్నారు.

రూ.కోట్లతో అభివృద్ధి

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ సారథ్యంలో మంగళగిరిలో నూతనంగా రూ.3.60 కోట్లతో రాజీవ్ గృహ కల్ప వద్ద మగ్గం షెడ్లను, రూ.5.50 కోట్లతో పాతబస్టాండ్ ఆవరణలో ప్రగడ కోటయ్య, వైఎస్సార్‌ల చేనేత భవనాల నిర్మాణంతో పాటు పట్టణంలోని చేనేత వస్త్ర దుకాణాల నిర్మాణాలు పూర్తయ్యాయి. జాతీయ స్థాయి అవార్డుకు చేనేత చీరలు ఎంపికవడం వలన జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంగళగిరి చేనేత చీరలకు మార్కెటింగ్ మెరుగైందని నేతన్నలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



రాజీవ్ గృహకల్ప వద్ద నిర్మించిన మగ్గం షెడ్లు

వైఎస్సార్ సీపీకి జనసేన మద్దతు



మంత్రి రజినిని కలిసిన నేరెళ్ల సురేష్, చిత్రంలో పార్టీ నేతలు



జనసేన నగర అధ్యక్ష పదవికి రాజీనామా చేసినట్లు ప్రకటిస్తున్న నేరెళ్ల సురేష్

- మంత్రి విడదల రజినిని కలిసి మద్దతు ప్రకటించిన జనసేన గుంటూరు నగర అధ్యక్షుడు నేరెళ్ల సురేష్
- వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని వెల్లడి

పట్నంబజారు: జనసేన పార్టీ గుంటూరు నగర అధ్యక్షుడు నేరెళ్ల సురేష్ మంగళవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజినిని కలిశారు. చంద్రమౌళినగర్‌లోని మంత్రి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గంలో మంత్రి విడదల రజినితో పాటు పార్లమెంటు అభ్యర్థి కిలారి రోశయ్య, గుంటూరు తూర్పు నియోజకవర్గ అభ్యర్థి నూరి ఫాతిమా గెలుపు కోసం పనిచేస్తామని సురేష్ చెప్పారు. వందలాది మంది జనసేన కార్యకర్తలతో కలిసి వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరుతున్నామని ప్రకటించారు. ఆయనతోపాటు వైఎస్సార్ సీపీ నాయకులు గులాం రసూల్, బూసిరెడ్డి మల్లీశ్వరరెడ్డి ఉన్నారు.

జనసేనకు ఝలక్

- పార్టీకి రాజీనామా చేసిన నగర అధ్యక్షుడు నేరెళ్ల సురేష్
- జనసేనలో న్యాయం జరగలేదని అసంతృప్తి
- ఈనెల 3న వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు ప్రకటన

గుంటూరు ఎడ్యుకేషన్: జనసేన పార్టీకి గుంటూరు నగరంలో పెద్దదెబ్బ తగిలింది. ఆ పార్టీ నగర అధ్యక్షుడిగా ఉన్న నేరెళ్ల సురేష్ పార్టీ నగర అధ్యక్ష పదవితో పాటు పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. మంగళవారం కాకాని రోడ్డులోని జనసేన పార్టీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జనసేనకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. జనసేన విధానాలతో పాటు పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ చెప్పిన మాటలు, చేసిన వాగ్దానాలు నమ్మి పార్టీలో చేరానని, అయితే ప్రస్తుత పరిస్థితుల్లో కూటమిగా ఏర్పడిన తరువాత తీసుకున్న నిర్ణయాలపై తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి, పరిపాలన నచ్చి ఈనెల 3వ తేదీన తన మద్దతుదారులతో కలిసి వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు తెలిపారు. జనసేనలో కష్టపడి పనిచేసేవారికి తగిన గుర్తింపు లేదని, పార్టీకోసం కష్టపడి పనిచేసినా ప్రయోజనం లేదన్నారు. ప్రజా సంక్షేమ నాయకునిగా వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. సమావేశంలో నేరెళ్ల సురేష్ అనుచరులు, మద్దతుదారులు పాల్గొన్నారు. కాగా మంగళవారం రాష్ట్రవైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజినిని కలిసిన అనంతరం నేరెళ్ల సురేష్ జనసేనకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

ర్యాండమైజేషన్ అత్యంత కీలకం

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి



ర్యాండమైజేషన్ ప్రక్రియను ప్రజా ప్రతినిధులు, అధికారులకు వివరిస్తున్న కలెక్టర్

గుంటూరు వెస్ట్: ఎన్నికల ప్రక్రియలో ఈవీఎంల బ్యాలెట్ యూనిట్‌లకు సంబంధించి జరిగే ర్యాండమైజేషన్ ప్రక్రియ ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జాతీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి అదనపు ఈవీఎం బ్యాలెట్ యూనిట్ అవసరమయ్యాయని, దీనిని మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించామన్నారు. గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థులు 30 మంది, గుంటూరు పశ్చిమ అసెంబ్లీకి 28, మంగళగిరికి 40 మంది అభ్యర్థులు పోటీలో ఉండటం వల్ల ఆయా నియోజకవర్గాల్లో అదనంగా ఈవీఎం బ్యాలెట్ యూనిట్లు సేకరించాల్సి ఉందన్నారు. అయితే జిల్లాలో ప్రస్తుతం ఈవీఎం గోడౌన్‌లలో 684 బ్యాలెట్ యూనిట్లు మాత్రమే ఉన్నాయన్నారు. వీటిలో గుంటూరు పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గంలోని 282 పోలింగ్ బూత్‌లకు రిజర్వుతో కలుపుకొని అవసరమైన 349 బ్యాలెట్ యూనిట్‌లను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించడం జరిగిందన్నారు. గుంటూరు పార్లమెంట్‌కు, మంగళగిరి అసెంబ్లీకి అవసరమైన బ్యాలెట్ యూనిట్‌లను పల్నాడు, బాపట్ల, ఏలూరు జిల్లాల్లోని రిజర్వులో ఉన్న బ్యాలెట్ యూనిట్‌లను రాష్ట్ర ఎన్నికల సంఘం జిల్లాకు కేటాయించిందన్నారు. అవి వస్తున్నాయని, వీటికి డీఈఎల్ నుంచి వచ్చిన ఇంజినీర్ల ఆధ్వర్యంలో ఫస్ట్ లెవల్ చెకింగ్ నిర్వహిస్తామన్నారు. డీఆర్‌ఓ పెద్దిరోజా, జీఎంసీ అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి, ఈవీఎంల నోడల్ అధికారి వేణుగోపాల్, ఐటీ నోడల్ అధికారి రఘు, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

భక్త జన కొండ



శిడిమానుకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

- భక్తుల కొంగుబంగారం కొండపాటూరు పోలేరమ్మ తల్లి
- అమ్మవారి దర్శనానికి రాష్ట్రం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు

కొండపాటూరు(కాకుమాను): భక్తుల కొంగు బంగారం జగజ్జనని, కోరిన కోర్కెలు తీర్చే తల్లి శ్రీ కొండపాటూరు పోలేరమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయాన్నే అమ్మవారిని పట్టువస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఎండల దృష్ట్యా దేవాలయానికి ఇరువైపులా ప్రత్యేక ఏర్పాట్లు చేసి అమ్మవారి దర్శించుకునేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు.

ప్రత్యేక ఆకర్షణగా శిడిమాను..

తిరునాళ్ల మహోత్సవంలో ప్రధాన ఘట్టం శిడిమాను. ఒక పెద్ద దూలానికి చివరి భాగాన ఒక ఇనుప బోను ఏర్పాటు చేసి అందులో ఒక శిడిపోతును ఏర్పాటు చేశారు. శిడిమానుకు రైతులు పండించిన వివిధ రకాల పంటలను కట్టి తమను చల్లగా చూడాలని ప్రత్యేక పూజలు చేశారు. శిడిమాను బయలుదేరే సమయంలో అమ్మ వారి స్వరూపంగా భావించే శిడిపోతుపైకి భక్తులు జీడికాయలు విసురుతారు. ఆ కాయలు బోనులో ఉన్న మేకపోతుకు తాకితే తమ కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. అనంతరం శిడిమానుకు గ్రామోత్సవం నిర్వహించారు. గుంటూరు, బాపట్ల, పొన్నూరు, చిలకలూరిపేట డిపోల నుంచి ప్రత్యేక బస్సులను నడిపారు. తిరునాళ్ల సందర్భంగా దేవాలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో ఆకర్షణీయంగా అలంకరించారు. తిరునాళ్ల ఏర్పాట్లను ఉత్సవ కమిటీ సభ్యులు కంతమనేని నరేష్ కుమార్, ఈఓ సురేష్ కుమార్, గ్రామ పెద్దలు పర్యవేక్షించారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

విద్యార్థి ఉత్తమ జీవితానికి దిక్సూచి విద్య

- పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి
- ఘనంగా మద్దిరాల నవోదయ విద్యాలయ వార్షికోత్సవం

చిలకలూరిపేట టౌన్ : విద్యార్థి ఉత్తమ జీవితానికి దిక్సూచి విద్య ఒక్కటేనని పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి చెప్పారు. రూరల్ మండలంలోని మద్దిరాల గ్రామంలో పీఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయంలో వార్షికోత్సవ వేడుకలు మంగళవారం జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ చదువు సంస్కారాన్ని నేర్పించి, విజ్ఞానాన్ని అందిస్తుందన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విద్యాలయ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు 2023-24 విద్యా సంవత్సర ప్రగతి వివరాలను తెలిపారు. మరో అతిథి చిలకలూరిపేట ధనలక్ష్మి గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ లింగయ్య చౌదరి, పలువురు ఉపాధ్యాయులు ప్రసంగించిన వారిలో ఉన్నారు. వార్షిక వేడుకల్లో భాగంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



మాట్లాడుతున్న పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి



సాంస్కృతిక ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

ఏఎస్‌ఐపై యువకుల దాడి

బైక్‌పై నుంచి పడి తీవ్రగాయాలు

తెనాలిరూరల్: ఏఎస్‌ఐపై గుర్తుతెలియని యువకులు దాడి చేశారు. బైక్‌పై వెళుతున్న ఆయన్ను నెట్టడంతో కిందపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. తెనాలి పోలీస్ కంట్రోల్ రూమ్‌లో ఏఎస్‌ఐగా పనిచేస్తున్న శ్రీనివాసరావు మంగళవారం ఉదయం డ్యూటీ నిమిత్తం డీఎస్పీ ఆఫీస్‌కు వెళుతుండగా బస్టాండ్ నుంచి వీఎస్సార్ కళాశాలకు వెళ్లే రోడ్డులో సిగరెట్ కొట్టు వద్ద కొందరు యువకులు ఉండడాన్ని గమనించారు. యువకులను వారించి పంపించి తన బైక్‌పై వెళుతుండగా వెనుక నుంచి వాహనాలపై వెంబడించిన యువకులు శ్రీనివాసరావును నెట్టడంతో కిందపడి తీవ్ర గాయాలపాలయ్యారు. చికిత్స పొందుతూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

రుణం పేరిట మోసం చేస్తున్న వ్యక్తి అరెస్ట్

తెనాలిరూరల్: లోన్‌యాప్‌ల ద్వారా ఎక్కువ మొత్తంలో రుణం ఇప్పిస్తాననంటూ సైబర్ నేరాలకు పాల్పడున్న వ్యక్తిని త్రీ టౌన్, సీఐడీ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు మంగళవారం తెలిపిన వివరాలు. దుగ్గిరాల మండలం ఈమనికి చెందిన షేక్ అబ్దుల్ బారి అపరిత వ్యక్తులకు ఫోన్ చేసి వారికి లోన్‌యాప్‌లలో రుణం ఇప్పిస్తానని నమ్మబలుకుతాడు. వారిని కలసి వారి ఫోన్‌లలో లోన్ యాప్‌లను ఇన్‌స్టాల్ చేసి, వాటి ద్వారా లోన్ దరఖాస్తు చేయిస్తాడు. లోన్ యాప్ ద్వారా వచ్చిన రుణాన్ని తనకు తిరిగి ఇచ్చేస్తే ఎక్కువ మొత్తంలో లోన్ ఇప్పిస్తానని చెప్పి డబ్బులు దండుకుంటుంటాడు. ఈ క్రమంలోనే తెనాలి పాండురంగపేటకు చెందిన ఏడుకొండలుకు రూ. మూడు లక్షల లోన్ ఇప్పిస్తానని చెప్పి అతడి ఫోన్‌లో టాటా క్యాపిటల్, మనీ వ్యూ లోన్‌యాప్‌లను ఇన్‌స్టాల్ చేయించి వాటి దారా లోన్‌కు దరఖాస్తు చేయించాడు. ఈ యాప్‌ల ద్వారా ఏడు కొండలుకు రూ.26 వేలు, రూ.49 వేలు లోన్‌కింద వచ్చాయి. పొరపాటున తక్కువ మొత్తం వచ్చిందని, వచ్చిన మొత్తాన్ని తనకు ఫోన్ పే ద్వారా పంపిస్తే రూ.మూడు లక్షల రుణం ఇప్పిస్తానని నమ్మబలికాడు. ఈ విధంగా ఏడుకొండలు వద్ద రూ.1,16,000 దండుకున్నాడు. బాధితుడు నెల నెలా లాన్ యాప్‌లకు ఈఎంఐలు చెల్లించాల్సి వస్తుండడంతో మోసపోయానని గ్రహించి త్రీ టౌన్ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసిన గుంటూరు సీఐడీ సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు, ఎస్ఐలు ఫాతిమా, రాజు, పీసీలు ఆనంద్‌కుమార్, సాయి మౌనికశ్రీలను సీఐడీ అదనపు డీజీ ఎస్.సంజయ్ అభినందించారు.

టీడీపీలో చేరిన వంగిపురం పంచాయతీ ఉద్యోగి



వంగిపురం(ప్రత్తిపాడు): గ్రామ పంచాయతీలో విధులు నిర్వర్తిస్తున్న ఓ ఉద్యోగి టీడీపీ కండువా కప్పుకున్నాడు. ఆలస్యంగా ఘటన చూసింది. వివరాలు.. ప్రత్తిపాడు మండలం వంగిపురం పంచాయతీలో పుసులూరి బసవయ్య అనే వ్యక్తి టెండర్ ప్రాతిపదికన గుమస్తాగా, పార్ట్ టైం బిల్ కలెక్టర్‌గా విధులను నిర్వర్తిస్తున్నారు. అతడికి ప్రతి నెలా రూ.13 వేలు చొప్పున గ్రామ పంచాయతీ నుంచి జీతాన్ని చెల్లిస్తున్నారు. వారం రోజుల కిందట ఇదే గ్రామంలో టీడీపీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అందులో భాగంగా బసవయ్య రామాంజనేయులు సమక్షంలో టీడీపీలో చేరారు. స్వయంగా రామాంజనేయులు బసవయ్యకు టీడీపీ కండువా, జనసేన పార్టీ కండువాలు కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. ఈ ఫొటోలు ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశమవుతున్నాయి.

యువతకు పెద్దపీట వేసింది జగనన్నే

- సచివాలయాల ద్వారా 1.35 లక్షల మందికి శాశ్వత ఉద్యోగాలు
- డీఎస్సీ ద్వారా 21వేలకు పైగా ఉద్యోగాలు
- వైద్య ఆరోగ్యశాఖలో 54 వేల పోస్టుల భర్తీ
- పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇచ్చేలా చట్టం
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని వెల్లడి



పార్టీలో చేరిన వారితో మంత్రి విడదల రజిని

పట్నంబజారు: యువతకు బంగారు భవిష్యత్ అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గత ఐదేళ్లుగా ఎంతో కృషి చేశారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ పశ్చిమ అభ్యర్థి విడదల రజిని తెలిపారు. స్థానిక శ్యామలానగర్‌లోని మంత్రి నివాసంతో పాటు, పర్యటనల్లో పలు చోట్ల టీడీపీ, జనసేనల నుంచి భారీగా యువత వైఎస్సార్ సీపీలో చేరగా, వారికి కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ ఈ ఐదేళ్లలో గ్రామ సచివాలయాల ఏర్పాటు ద్వారా 1,35,819 మందికి శాశ్వత ఉద్యోగాలు కల్పించామని చెప్పారు. 50 నుంచి 70 ఇళ్లకు ఒక వలంటీర్ చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 2.66 లక్షల వలంటీర్ల నియామకం ఇప్పటికే చేపట్టామని తెలిపారు. డీఎస్సీ ద్వారా 21 వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. వైద్య ఆరోగ్యశాఖలో 54వేలకుపైగా ఉద్యోగాలు ఇచ్చామని, ఏకంగా 2.31 లక్షల శాశ్వత ఉద్యోగాలు ఇచ్చిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్‌తో కలిసి ఐదేళ్లలో ఇచ్చిన మొత్తం ఉద్యోగాలు ఏకంగా 6.48 లక్షలు అని చెప్పారు. పరిశ్రమల్లో సైతం 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇచ్చేలా చట్టం చేశామని వివరించారు. ఈ రోజు స్వచ్ఛందంగా పలు పార్టీల నుంచి వచ్చి వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని పేర్కొన్నారు.

22వ డివిజన్ నుంచి...

శ్రీనివాసరావుపేట నుంచి 22వ డివిజన్ అధ్యక్షుడు జానీబాషా ఆధ్వర్యంలో టీడీపీ నుంచి 50 మందికిపైగా మంత్రి నివాసంలో పార్టీలో చేరారు. షాబుల్, తాహెదుల్లా, హుస్సేన్, సోడాల మస్తాన్, కడప బాషా, షేక్ హుస్సేన్ పీరా, సయ్యద్ అజీజ్, కొండల్‌రావు, శ్రీనివాస్, షేక్ అక్బరి, షేక్ నాగూర్‌వలి, షేక్ సయ్యద్‌ఖాన్, సిలార్, హాసన్, సూరిబాబు, మస్తాన్‌వలి పార్టీలో చేరినవారిలో ఉన్నారు.

44వ డివిజన్ నుంచి....

44వ డివిజన్ నుంచి 22 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. టీడీపీ, జనసేనల నుంచి ఈ చేరికలు జరిగాయి. వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు వలివీరారెడ్డి, రావెల విజయవర్ధన్, నూతక్కి జాన్‌విక్టర్ ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. పార్టీలో చేరినవారిలో కొడారి సందీప్, కూరపాటి చందు, దూదేకుల షరీఫ్, కొరిటిపాటి రవి, సరేకుల విజయ్, కొటారి సూర్య, పగడాల మణి, దేవరకొండ సంజయ్, కొరిటపాటి మరియరాజు, రావెల అనిల్, కొరిటిపాటి మరియదాసు ఉన్నారు.

19, 20 డివిజన్ల నుంచి..

19, 20 డివిజన్ల నుంచి కూడా భారీగా చేరికలు జరిగాయి. వైఎస్సార్ సీపీ నాయకుడు గడ్డం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో 60 మంది, జిలాని ఆధ్వర్యంలో 30 మంది, మార్కెట్ యార్డు డైరెక్టర్ ఖాజామొయిద్దీన్ ఆధ్వర్యంలో 25 మంది టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. గ్రంధి రామారావు, నల్లక రమాదేవి, షేక్ ఫక్రుద్దీన్, అమీరున్నీసా, జ్యోతి, సుబ్రహ్మణ్యం, రామకృష్ణ, మస్తాన్‌వలి, సాంబశివరావు, శ్రీనివాస్ తదితరులు పార్టీలో చేరినవారిలో ఉన్నారు.

రికార్డు స్థాయిలో ఇళ్ల స్థలాల పంపిణీ

- నియోజకవర్గంలో గరిష్టంగా సంక్షేమ లబ్ధి
- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శివకుమార్



తెనాలి కొత్తపేటలో ఓ కుటుంబాన్ని ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: వైఎస్సార్ సీపీ తెనాలి నియోజకవర్గ అభ్యర్థి, సిటింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. రోడ్‌షోలు, ఆత్మీయ సమావేశాలు, కుటుంబ సభ్యుల ప్రచారం కొనసాగుతోంది. స్థానిక ముఖ్యులు, సీనియర్ సిటిజన్లను వారి ఇంటి వద్దకే వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. మీ ఆశీర్వాదం కోసం వచ్చానంటూ, రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మరోసారి వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం పట్టణ ఏడో వార్డులోని కొత్తపేటలో ఎమ్మెల్యే శివకుమార్ పలువురు ఆర్యవైశ్య ముఖ్యులను వ్యక్తిగతంగా కలిసినపుడు సానుకూల స్పందన కనిపించింది. ఎమ్మెల్యే ఎవరి ఇంటికి వెళ్లినా, ఆ కుటుంబ సభ్యులు ఆప్యాయంగా ఎదురేగి స్వాగతం పలికారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా తాను నియోజకవర్గంలో సంక్షేమాన్ని గరిష్టంగా అందించినట్టు శివకుమార్ వారికి వివరిస్తున్నారు. అగ్రవర్ణాల్లోని పేదలను గుర్తించి వారికి కూడా ఈబీసీ నేస్తం కింద ఆర్థికసాయం అందించినట్లు చెప్పారు. గతంలో ఏ ఎమ్మెల్యే హయాంలోనూ లేనివిధంగా రికార్డు స్థాయిలో పేదలకు ఇళ్లస్థలాలను రిజిస్ట్రేషను పత్రాలతో సహా అందజేశానని పేర్కొన్నారు. నాడు-నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్ని తీర్చిదిద్దిన విషయాన్ని వారితో పంచుకున్నారు. తెనాలిలో పట్టణ ఆరోగ్య కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చి ప్రజలకు వైద్యసేవలను అందుబాటులోకి తెచ్చామని గుర్తుచేశారు. ఇంకోవైపు పట్టణంలో 160 రోడ్లను కొత్తగా వేశామని వివరించారు. రానున్న రోజుల్లో సంక్షేమాన్ని పెంచి అందిస్తూనే పట్టణ అభివృద్ధికి మరింతగా తోడ్పడతానని హామీనిచ్చారు. రానున్న ఎన్నికల్లో గుంటూరు ఎంపీ అభ్యర్థిగా కిలారి వెంకట రోశయ్య, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను గెలిపించాలని అభ్యర్థించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, పట్టణ క్లస్టర్-1 అధ్యక్షుడు మద్దాళి శేషాచలం, పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు దేసు శ్రీనివాసరావు, ఆర్య వైశ్య మహాసభ నాయకుడు సాధు ప్రతాప్, గొడవర్తి సాయి హరేరామ్, ఎస్వీ బ్రహ్మం, కొల్లా గురునాథగుప్త, పెనుగొండ వెంకటేశ్వరరావు, మాలేపాటి తిరుమలరావు, పెనుగొండ సతీష్, కొల్లిపర రాజా, చుండూరు సాయి, భాస్కరుని లక్ష్మీనారాయణ, ఆలమూరి ఫణి పాల్గొన్నారు.

పెమ్మసాని తీరు గర్హనీయం

- వైఎస్సార్ సీపీ డాక్టర్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు వై షేక్

పట్నంబజారు: నాయకుల కొనుగోళ్లకు సంబంధించి టీడీపీ లోక్‌సభ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ వ్యవహరిస్తున్న తీరును గర్హనీయం అని వైఎస్సార్ సీపీ డాక్టర్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వై షేక్ పేర్కొన్నారు. తనను ప్రలోభాలకు గురిచేసి, బలవంతపెట్టి పార్టీ మార్చాలని ఒత్తిడి చేస్తున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డబ్బులు ఎరవేస్తున్నారని, డబ్బుంటే చాలు అందరినీ కొనేయొచ్చనే వ్యవహారశైలిలో పెమ్మసాని ఉన్నాడని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు డబ్బుకు అమ్ముడుపోయే వాళ్లు కాదని హితవు పలికారు. డబ్బుంటే చాలు ఏదైనా సాధ్యమే అనేలా పెమ్మసాని మాటలు ఉన్నాయని, ఆయన వ్యవహరిస్తున్న తీరు అతని విజ్ఞతకే వదిలేస్తున్నామని వెల్లడించారు. తామంతా వైఎస్సార్ సీపీకి ఎప్పటికీ విధేయులమేనని, జగన్ వెన్నంటే ఉంటామని స్పష్టం చేశారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో విడదల రజిని గెలుపునకు కట్టుబడి ఉన్నామని, లోక్ సభ అభ్యర్థి రోశయ్య గెలుపు లక్ష్యంగా పనిచేస్తామన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి

తాడికొండ ఎమ్మెల్యే అభ్యర్థి సుచరిత



ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే సుచరితకు స్వాగతం పలుకుతున్న పార్టీ కార్యకర్తలు

ఫిరంగిపురం: ప్రజాసమస్యల పరిష్కారం కోసం తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ తాడికొండ ఎమ్మెల్యే అభ్యర్థి, ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత అన్నారు. మండలంలోని యర్రగుంట్లపాడు, బేతపూడి గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని వీధులలో ప్రచార రథంపై తిరుగుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సంక్షేమ రథసారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. కుల, మత , ప్రాంతాలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ ఫలాలు అందేలా చేసిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతోందని పేర్కొన్నారు. అవ్వా, తాతలకు ఇంటివద్దకే వచ్చి పింఛన్లు వలంటీర్లు అందించాలంటే మళ్లీ తిరిగి వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావాలని చెప్పారు. ప్రతి గ్రామంలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు అన్ని రకాల సదుపాయాలు కల్పించారని తెలిపారు. నాడు- నేడు ద్వారా శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాలను నూతన ఆధునిక భవనాలు ఏర్పాటు చేసి ఇంగ్లిష్‌లో విద్యాబోధనకు అవకాశం కల్పించినట్లు వివరించారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించే బాధ్యత తనది అని హామీ ఇచ్చారు. కార్యక్రమానికి ముందుగా గ్రామంలోని వేణుగోపాలస్వామి, వరసిద్ధివినాయక స్వామి, ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. అనంతరం ఆర్సీఎం చర్చి, తెలుగు బాపిస్టు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, ఎంపీపీ షేక్ షహేలానర్గిస్, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు నన్నం సునీత, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, నాయకులు చిట్టా అంజిరెడ్డి, పాలపాటి రఘు, చేవూరి రామమోహన్‌రెడ్డి, బి.శ్రీనివాసరెడ్డి, జి.మస్తాన్‌వలి, జి.ఆదంబీ, షేక్ ఖాసింషాహిద్, ఖాజావలి, జాకీర్, ఎం.సుధాకరరెడ్డి, బి.జయరామిరెడ్డి, ఎస్.నాగిరెడ్డి, వి.శ్రీనివాసరెడ్డి, వి.రోశిరెడ్డి, కె.అప్పిరెడ్డి, చౌడయ్య, సంజీవరెడ్డి, దశరథరామిరెడ్డి, డి.సురేష్, పి.శ్రీనివాసరెడ్డి, వెంకటరెడ్డి, ప్రతాపరెడ్డి, ఎస్.బ్రహ్మారెడ్డి, చంద్రశేఖరరెడ్డి, ప్రసాద్, రాంబాబు, నాగరాజు, రామారావు, టి.కృష్ణ, శివారెడ్డి, ఎస్.వెంకటప్పారెడ్డి, తిరుపతిరెడ్డి, బి.అంజిరెడ్డి, అయ్యప్ప పాల్గొన్నారు.

గుంటూరులో మిర్చిబోర్డు ఏర్పాటుకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి విడదల రజిని, వేదికపై లోక్ సభ అభ్యర్థి కిలారి రోశయ్య, ఎమ్మెల్యే అభ్యర్థులు బలసాని, నూరి ఫాతిమా తదితరులు

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- అంకిరెడ్డిపాలెంలో ది మిర్చి, చిల్లీస్ ఫ్రెండ్స్ ఆత్మీయ సమావేశం

గుంటూరు రూరల్: గుంటూరులో మిర్చి బోర్డు ఏర్పాటుకు కృషిచేస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి విడదల రజిని తెలిపారు. మంగళవారం అంకిరెడ్డిపాలెం సమీపంలోని వీఆర్‌కే గార్డెన్స్‌లో ది మిర్చి, చిల్లీస్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో జరిగిన ఎగుమతి, దిగుమతి దారుల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, గుంటూరు పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి కిలారి వెంకటరోశయ్య, ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్, గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే అభ్యర్థి నూరిఫాతిమా, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము)లతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి, పశ్చిమ అభ్యర్థి రజిని మాట్లాడుతూ యార్డు చరిత్రలో ఎన్నడూ లేనంతగా మిర్చి ధరలను పెంచి రైతులు, ఎగుమతి, దిగుమతి దారులకు ఎటువంటి సమస్యలు లేకుండా జగనన్న ప్రభుత్వంలో చూడటం జరిగిందన్నారు.

ఎంపీ అభ్యర్థి కిలారి రోశయ్య మాట్లాడుతూ యార్డు చరిత్రలో రైతులకు తొలిసారిగా భోజన సౌకర్యం కల్పించింది దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని తెలిపారు. ప్రస్తుతం జగనన్న ప్రభుత్వంలో భోజన వసతితోపాటుగా, టిఫిన్‌కూడా ఉచితంగా అందిస్తున్నామన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఎప్పుడు చూసినా మిర్చి ఎగుమతులు, దిగుమతుల సమస్యలతో రైతులు కొట్టుమిట్టాడేవారని గుర్తు చేశారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ఎన్ని ప్రభుత్వాలు మారినా నేటివరకూ రైతులకు, వ్యాపారులకు మంచి చేసిన నాయకులు ఇద్దరే ఇద్దరని వారు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కాగా, తరువాత నేటి మనందరి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని తెలిపారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి పథంలో నడిపించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. కోవిడ్ సమయంలోనూ సంక్షేమ పథకాలు అందించి రాష్ట్రాన్ని, ప్రజలను కాపాడిన గొప్ప నాయకుడు మన జగనన్న అని తెలిపారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని మాట్లాడుతూ ప్రజలకు మంచి చేసే నాయకులకు మనమందరం మద్దతు తెలపాల్సిన అవసరం ఉందన్నారు. గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే అభ్యర్థి నూరి ఫాతిమా మాట్లాడుతూ మిర్చి కార్మికులు, ఎగుమతి దిగుమతి దారుల సమస్యలు పరిష్కరించి ఎల్లప్పుడూ వారికి, పేదలకు అండగా ఉన్న ముఖ్యమంత్రి మన జగనన్న అని తెలిపారు. మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే అతి పెద్ద మిర్చి యార్డులో గత ఐదేళ్లుగా మిర్చి రైతులకు, వ్యాపారులకు ఎటువంటి సమస్యలు లేకుండా జగనన్న ప్రభుత్వంలో ఎంతో మేలు జరిగిందని వివరించారు. మే 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో యార్డు డైరెక్టర్‌లు, చిల్లీస్ అసోసియేషన్, ది మిర్చి, ఎగుమతి, దిగుమతి దారులు రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చేరికలు

వైఎస్సార్ సీపీ తూర్పు అభ్యర్థి షేక్ నూరిఫాతిమా



పార్టీలోచేరిన వారితో షేక్ నూరిఫాతిమా

పట్నంబజారు: టీడీపీ, జనసేన కూటమి తీరుతో విసిగిపోయిన ఆయా పార్టీల నేతలు, కార్యకర్తలు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమాభివృద్ధికి ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో పెద్ద ఎత్తున చేరుతున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరిఫాతిమా చెప్పారు. బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా కార్యాలయంలో 13వ డివిజన్, సంగడిగుంట, వడ్డెర గూడెంకు చెందిన వైఎస్సార్ సీపీ నేత చింతల భాను ప్రసాద్ ఆధ్వర్యంలో టీడీపీ, జనసేనకు సంబంధించి వంద మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు భీమనాథం పేరిరెడ్డి, నాగమల్లేశ్వరరావు, వేముల వెంకటేష్, కార్తీక్, రమాదేవి, రాజేష్, షన్ను, విజయ్ పాల్గొన్నారు.

భారీగా తెలంగాణ మద్యం స్వాధీనం

నగరంపాలెం: ఎన్నికల్లో తెలంగాణ మద్యం సీసాలను అధిక ధరలకు విక్రయించి, సొమ్ము చేసుకోవాలని భావించిన ఓ ముఠా గుట్టును ఎస్ఈబీ(సెబ్) ప్రత్తిపాడు స్టేషన్ పోలీసులు ఛేదించారు. ఇద్దరిని అరెస్ట్ చేసి, సుమారు రూ.8.03 లక్షల ఖరీదైన 6,376 సీసాలు, ఒక మినీ ట్రక్ ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ జిల్లా ఏఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయ(డీపీఓ) ఆవరణలో మంగళవారం సెబ్ సూపరింటెండెంట్ ఎల్.రంగారెడ్డి, ఏఎస్ ఎస్.కృష్ణకిషోర్‌రెడ్డి, సీఐలు విజయకుమార్ (గుంటూరు-1), లత (గుంటూరు-2), ప్రత్తిపాడు ఎస్ఐ సీహెచ్.మాధవితో కలసి మంగళవారం విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సోమవారం రాత్రి వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడు గ్రామ పరిధిలో శ్రీ పోలేరమ్మ గుడి వద్ద సెబ్ ప్రత్తిపాడు ఎస్ఐ సీహెచ్ మాధవి, సిబ్బందితో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఓ మినీ ట్రక్ ఆటోలో సోదాలు చేశారు. అందులో 180(ఎం.ఎల్) తెలంగాణ మద్యం సీసాలను(ఎన్‌డీపీఎల్) గుర్తించారు. 133 అట్టపెట్టెల్లో ఉన్న మద్యం సీసాలు టమాటాల కింద భద్రపరిచినట్లు వెల్లడైంది. దీంతో గుంటూరు నగరాలులోని సరస్వతికాలనీకి చెందిన పాలెం రామమోహన రావు, రెడ్డిపాలెంలో ఉంటున్న పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం కొత్తపాలెం గ్రామ వాసి గోసుల శ్రీనుని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరం రుజువు కావడంతో ఇద్దరిని అరెస్ట్ చేసి, సుమారు రూ.8.03 లక్షల ఖరీదైన 6,376 మద్యం సీసాలు, మినీ ట్రక్ ఆటోను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో ఇద్దర్ని త్వరలో పట్టుకుంటామని ఏఎస్పీ చెప్పారు.

ఈ కేసులో ఏ1 పాలెం రామమోహన్‌రావు ఇతర రాష్ట్రాల నుంచి ఎన్‌డీపీఎల్ మద్యం తీసుకొచ్చిన కేసుల్లో నిందితుడు. అతడిపై గుంటూరు-1, 2, మంగళగిరి సెబ్ స్టేషన్లల్లో కేసులు ఉన్నాయి. అతను రానున్న ఎన్నికల్లో తక్కువ వ్యవధిలో ఎక్కువ డబ్బు సంపాదించవచ్చునని తుళ్ళూరు మండలం దొండపాడు గ్రామ వాసైన పెనుమాక పూర్ణచంద్రరావు దృష్టికి తీసుకొచ్చాడు. దీంతో పూర్ణచంద్రరావు అతడికి డబ్బులు అందజేశాడు. ఇక రామమోహనరావు, డ్రైవర్ శ్రీను కలసి తెలంగాణలో హనుమంతరావుని సంప్రదించి నగదు చెల్లించారు. హనుమంతురావు ఎస్ఆర్ వైన్స్ దుకాణంలో 180 ఎం.ఎల్ మద్యం సీసాలను 133 అట్టపెట్టెల్లో తీసుకుని రామమోహనరావు, శ్రీనులకు అప్పగించారు. దీంతో వారిద్దరూ కలిసి పూర్ణచంద్రరావుకు అప్పగించేందుకు ప్రత్తిపాడు వైపు బయలుదేరారు. ఈలోగా మద్యం సీసాల ట్రక్ ఆటోను చాకచాక్యంగా పట్టుకున్నారు. కేసులో ప్రతిభ చూపిన సెబ్ ప్రత్తిపాడు ఎస్ఐ మాధవి, సిబ్బందిని అభినందించారు. ఎస్ఐ తులసి పాల్గొన్నారు.